ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
18 అక్టోబర్ 2025

# క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అస్పిరేషనల్ బ్లాక్ పరిధిలో అమలవుతున్న ఇంగ్లీష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రామ్ అమలు తీరును శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న ఇంగ్లీష్ పాఠాలను అడిగి తెలుసుకున్నారు. స్టోరీస్, పోయెమ్స్, టూ లెటర్ వర్డ్స్, త్రీ లెటర్ వర్డ్స్, ఫోర్ లెటర్ వర్డ్స్ వంటి పదాలు చదవడం, రాయడం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంతో ఇంగ్లీష్ లో తాము అభివృద్ధి సాధిస్తున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష ఇప్పుడు ప్రతి విద్యార్థికి అత్యవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమశిక్షణతో చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక అవకాశాలు లభిస్తాయని అన్నారు. విద్యార్థుల ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యాన్ని పెంచేందుకు రూపొందించిన ప్రత్యేక పుస్తకంలోని వర్క్ షీట్స్ ను ప్రతిరోజు పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కాగా గుణాత్మక విద్య కోఆర్డినేటర్ అజయ్ ఈ కార్యక్రమం అమలు విధానాన్ని, ఇప్పటి వరకు సాధించిన ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అనిత, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం నార్నూర్ మండలంలోని గుండాల గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రతి ఇంటి నిర్మాణ దశను ప్రత్యక్షంగా పరిశీలించి కూలీలు, లబ్ధిదారులతో మాట్లాడారు. నాణ్యతతో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం కల్పిస్తున్న గృహాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి లబ్ధిదారుడు సొంత గృహం కలగటం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ఎక్కడైనా సాంకేతిక, పరిపాలన ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బేస్‌మెంట్ నిర్మాణం, పైకప్పు పనుల పురోగతిని పరిశీలించారు. ఇంకా పూర్తికాని ఇళ్లు తక్షణమే పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు.





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**ఉద్యమం కెరటం, మంచిర్యాల:** నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జైపూర్ మండలం గంగిపల్లి, షెట్ పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఏఈ కాంసానిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బేస్ మెంట్, లెంటల్, స్లాబ్ స్థాయిల వారీగా పూర్తయిన పనులకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని వేలాల గ్రామంలో గల ఇసుక రీచ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇసుకను తీయాలని, ఇందిరమ్మ పథకంలో ఇండ్ల నిర్మాణాలకు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ముందుగా ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# న్యాయమూర్తిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం బెజ్జూర్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం మండల నాయకులు నిట్టూరి శ్రీశైలం మాదిగ మాట్లాడుతూ ఈ దాడి కేవలం దళిత బహుజనులపై కాదని, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నాటి నుంచి నేటి వరకు మనువాదులు దాడులు చేస్తూ వస్తున్నారని, సమర్థవంతంగా వాటిని ఎదుర్కొంటూ నిలబడుతున్నామని తెలిపారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. భారత దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా దళితులపై దాడులు ఆగడం లేదని మండిపడ్డారు. ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేనప్పుడు దేశంలోని దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రిజర్వేషన్లతో భారత ప్రధాని దళితులకు ఇచ్చిన గౌరవం ఇలాంటి దాడులతో మచ్చ తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డూరి శ్రీనివాస్ మాదిగ, ఇప్ప జనార్ధన్ మాదిగ, చిప్పకుర్తి వెంకటి మాదిగ, నిట్టూరి లలితా మాదిగ, చిప్పకుర్తి నవీన్ మాదిగ, కుమ్మరి శంకర్, కంబాల అన్వేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# బంద్‌ను విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతంచట్టబద్ధ ప్రాతినిధ్యం కోసం బీసీ సంఘాలు పిలుపునిచ్చిన బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని తెలిపారు. హైకోర్టులో కేసు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. బంద్ లో బోథ్, సొనాల, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులు, వర్తక, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు కళాశాలలు, హోటళ్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

# దీపావళి ఆఫర్లతో సైబర్ మోసాలు



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** దీపావళి పండగ సందర్భంగా స్పెషల్ ఆఫర్ల పేరుతో సైబర్ మోసగాళ్లు సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా నకిలీ వెబ్‌సైట్లు, లింకులు పంపి ప్రజలను మోసం చేస్తున్నారని బెల్లంపలిల వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఈ లింక్‌ల ద్వారా షాపింగ్ ఆఫర్లు, లాటరీలు, గిఫ్ట్ కూపన్లు వంటి ప్రలోభాలు చూపి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్ లింక్‌లు, వెబ్‌సైట్లలో వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు ఇవ్వకూడదని సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నివేదిక ప్రకారం అక్టోబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 390 మంది బాధితులు ఈ రకమైన మోసాలకు గురై రూ. 8.5 లక్షలు కోల్పోయినట్లు తెలిపారు. అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారానే షాపింగ్ చేయాలని, సోషల్ మీడియా లింక్‌లు, ఏపీకే ఫైళ్లను క్లిక్ చేయకూడదని పేర్కొన్నారు. ముందుగా చెల్లింపులు చేయవద్దని, సాధ్యమైనంత వరకు డెలివరీ తర్వాత నగదు చెల్లించే విధానాన్నిఎంచుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని వివరించారు.

# జడ్జిపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజే గవాయిపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఈ దాడి కేవలం దళిత బహుజనులపై కాదని, భారత రాజ్యాంగంపై జరిగిన దాడి అని చెపుపకొచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేనప్పుడు దేశంలోని దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జల శంకర్ మాదిగ, గజ్జల అశోక్ మాదిగ, గొనె ఆడెల్లు మాదిగ, జి సంతోష్ మాదిగ, రవి మాదిగ, జుల ఆడేళ్లు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# 108లో గర్భిణీ ప్రసవం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండలంలోని ఘాట్ జనగాం గ్రామానికి చెందిన రేణుక అనే గర్భిణి 108లో ప్రసవించింది. శుక్రవారం ఉదయం రేణుక పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో స్థానిక అంబులెన్స్ సిబ్బంది వైద్య అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు ప్రసవం జరిపించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండగా, మెరుగైన వైద్య సేవల కోసం వాంకిడి ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తలపెట్టే పరిస్థితుల్లో చాకచక్యంగా వ్యవహరించిన అంబులెన్స్ సిబ్బంది ధైర్యానికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.





# ప్రారంభమైన గుస్సాడీ సంబురాలు

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడీ సంబురాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. గుస్సాడీ వేషధారణలో ఆదివాసీలు వారి ఆచారాలకు అనుగుణంగా పవిత్ర దీక్షగా భావించి భక్తి, నిష్ఠలతో ఉంటారు. శుక్రవారం గుడిహత్నూర్ మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో గ్రామస్తులంతా కలిసి పూజ కార్యక్రమాలు, అన్నదాన కార్య క్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటేల్ నైతం గణపతి రావు, దేవారి నైతం తులసీరాం, మహాజన్ కనుక ముకుందరావు, రాథోడ్ రమేష్, మచ్చాపూర్, కొద్దుగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్ లో సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ జిల్లా, మండల స్థాయి యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ తరఫున ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులను ఎన్నుకోవడానికి జిల్లా, మండల యూత్ కాంగ్రెస్ నాయకుల అభిప్రాయాలను ఏఐసీసీ అబ్జర్వర్ అజయ్ సింగ్ సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, బోథ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతా రెడ్డి, సద్దాం, మహేందర్, వసీం, విష్ణు, సాయి కిరణ్, మక్సూద్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## అది రాజ్యాంగంపై జరిగిన దాడి

**ఉద్యమ కెరటం, తాండూర్:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డిఆర్ గవాయిపై దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఎమ్మార్పీఎస్ తాండూర్ మండల ఇంచార్జ్ ఆయిల్ల గణేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూర్ తహశీల్దార్ యు జ్యోత్స్నకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డిఆర్ గవాయిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ దాడి కేవలం దళిత బహుజనులపై కాదని, భారత రాజ్యాంగంపై జరిగిన దాడి అని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, అయిల్ల నరసింహులు, వేముల అభిలాష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బంద్‌ను విజయవంతం చేయాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బీసీ రిజర్వేషన్ కోసం తలపెట్టిన బీసీ బంద్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు, కలిసి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. బీసీల శ్రేయస్సు కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. వ్యాపారులు, విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీ సమాజ ఐక్యతను చాటాలని పేర్కొన్నారు.

## బంద్‌కు మాలీల సంపూర్ణ మద్దతు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బీసీ బంద్‌కు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే తెలిపారు. రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మాలి కులస్తులందరూ శనివారం జరిగే బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల స్ఫూర్తితో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి తమ జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్లు సాధించుకోవాలని, అప్పుడే పూలే అంబేద్కర్లు కలలు కన్న సామాజిక న్యాయం బడుగు బలహీన వర్గాలకు లభిస్తుందని పేర్కొన్నారు. కేవలం కంటి తుడుపు చర్యగా కాకుండా తమిళనాడు ప్రభుత్వం లాగా తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి బీసీ రిజర్వేషన్లను అలాగే పార్లమెంటులో తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదం ద్వారా మాలి, మధుర, వాల్మీకి, బోయలకు ఎస్టీ హోదా కల్పన కోసం అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు.

## విద్యార్థులకు స్నాక్స్ అందజేత



**ఉద్యమ కెరటం, తాండూర్:** పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. అచలాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి చిన్ననాటి స్నేహితురాలు గంగాజమున ఆమె తండ్రి గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు సాయంత్రం సమయంలో స్నాక్స్ అందించారు. రూ. 5వేలు పాఠశాలకు అందించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవితో పాటు ఉపాధ్యాయులు డి రాజేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, భాస్కర్, హరి ప్రసాద్, అంజిరెడ్డి, కే శ్రీనివాస్, పీడీ సాంబమూర్తి, సంగీతం శ్రీనివాస్, విద్యార్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు కరువారి శంకర్–లక్ష్మి దంపతుల కూతురు రమ్య– నవీన్ వివాహానికి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ లక్ష్మణ్, వృద్ధాశ్రమ నిర్వాహకులు, మాజీ జెడ్పీటీసీ మల్లుగారి నర్సా గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్, పట్టణ అధ్యక్షులు వెంకట యాదవ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మండల మహిళా అధ్యక్షురాలు లతా రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలవ్వ, టౌన్ అధ్యక్షురాలు నిరంజని, కొమ్మిశెట్టి లక్ష్మణ్, శివయ్య, బండ రమేష్, చిలక నందం, చిట్టెంపెల్లి రాజు, బాలకిషన్ రావు, శ్రీను, అభిలాష్, వికాస్, వెంకటస్వామి గౌడ్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి

### నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర



**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం రాజేష్‌చంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసును నాణ్యతతో, పారదర్శకంగా దర్యాప్తు చేసి చార్జిషీట్లు సమయానుసారం పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించి, ప్రజల ఆస్తుల భద్రతకు అధికారులు కట్టుబడి పనిచేయాలన్నారు. దీపావళి పండగ నేపథ్యంలో ప్రజలు బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, స్వీయ భద్రతతో పాటు ఇతరుల సురక్షితతను కూడా కాపాడాలని సూచించారు. పండగల సమయంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిరంతరంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో జూదంపై ప్రత్యేక నిఘా పెట్టాలని, జూదం ఆడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో అనవసరంగా తిరిగే వారిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రౌడీలు, సస్పెక్టులు, అనుమానితులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, ఓపెన్ డ్రింకింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ వంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. వాహన ఫేక్ నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు చేయాలని, రోడ్డు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. డయల్ 100కు కాల్స్ వచ్చిన వెంటనే స్పందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్‌లో అన్ని కేసు వివరాలను రోజువారీగా అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ బి చైతన్య రెడ్డి, యెల్లారెడ్డి డీఎస్పీ ఎస్ శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ స్టేషన్ రైటర్లు, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా క్రీడోత్సవాలు







**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్(యు) మండలం కోహినూర్(కె) ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జైనూర్ డివిజన్ క్రీడోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్రీడా అధికారి మడవి శేకు ప్రారంబించారు. మొదటగా విద్యార్థుల మర్చ్ ఫాస్ట్ వందనం స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చన్ చిత్రపటానికి పూలమాలలు వేసి క్రీడా జెండాను ఊపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రీడోత్సవాలు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ట్రైబల్ మీట్ లో భాగంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో గ్రామ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందని, గిరిజన క్రీడాకారులకు మంచి అవకాశాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. డివిజన్ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ డివిజన్ పాఠశాలల హెడ్ మాస్టర్లు పార్వతి, అనిత, భీమ్ రావ్, రాంబాయి, నాందేవ్, రాంచందర్, ఫిజికల్ డైరెక్టర్లు బిక్కు, వినోద్, చొక్కా రావ్, వెంకటేశ్వర్ రావ్, వనిత, అరవింద్, సుందర్ సింగ్, జల్పత్, గోకుల్, ఈశ్వర్, నాగోరావ్, సురేష్, శ్రీనివాస్, సంగీత, ధర్మరావ్, డిప్యూటీ వార్డెన్ భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# గంజాయి రహిత జిల్లానే లక్ష్యం

### జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఉద్యమ కెరటం, జైనూర్: కొమురంభీం ఆసిఫాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గంజాయిపై పోలీసులు ప్రత్యేక నిఘా, సెర్చ్ ఆపరేషన్లు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం సిర్పూర్(యు) మండలం బాబ్జిపేట గ్రామపంచాయతీ పరిధిలో 32 గంజాయి మొక్కలు, జైనూర్ మండలం మాన్కుగూడ గ్రామపంచాయతీ పరిధిలో 4 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సిర్పూర్(యు) పరిధిలో మూడు కేసులు నమోదు కాగా, గుట్టగూడకు చెందిన పెందూర్ భీంరావు నుంచి 26 మొక్కలు, కొత్తగూడకు చెందిన కొబాడ చిత్రు నుంచి ఒక గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని. ఇద్దరిపై కేసులు నమోదు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాబ్జిపేటకు చెందిన కనక లింబారావు నుంచి 5, జైనూర్ మండలంలోని మాన్కుగూడ గ్రామానికి చెందిన శ్యామ్ రావు మడవి పత్తి చేనులో 4 మొక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల గురించి సమాచారం ఉంటే డయల్ 100, 8712670551, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలను ఎస్సై రామకృష్ణ, రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు.





